నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 11 మార్చి 2025 | SANGAREDDY

నీటిమట్టం తగ్గిన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్

డెడ్ స్టోరేజీలో తపాస్‌పల్లి

నీళ్ల కోసం రిజర్వాయర్ వద్ద రైతుల ఎదురుచూపు

- సాగునీటి విడుదలలో కాంగ్రెస్ మొండిచేయి..
- రిజర్వాయర్ కింద వేల ఎకరాల్లో ఎండుతున్న పంటలు
- పంటలు కాపాడుకోవడానికి రైతుల పాట్లు
- ట్యాంకర్లతో పంటలు తడుపుతున్న రైతులు
- ఎండిన చెరువులు.. అడుగంటిన భూగర్భ జలాలు

సిద్దిపేట, మార్చి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామ జిల్లాలోని బచ్చన్నపేట రైతులకు కష్టాలు వచ్చాయి. ఈ ప్రాంతానికి సాగునీటిని అందించే తపాస్‌పల్లి రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉంది. దీనిని 0.3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. దీనికింద ఆయకట్టు 82,542 ఎకరాలుగా ప్రతిపాదించారు. కుడి కాల్వ ద్వారా 48,000 ఎకరాలు, ఎడమ కాల్వ ద్వారా 34,542 ఎకరాలు ప్రతిపాదించారు. పనులు పూర్తి కాకపోవడం మూలంగా 50శాతం మేర మాత్రమే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకు నీటిని విడుదల చేయలేదు. దీంతో పంటలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. సాగు నీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ రిజర్వాయర్‌కు దేవాదుల ప్రాజెక్టులో భాగంగా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి బొమ్మకురు రిజర్వాయర్‌కు అక్కడి నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో బొమ్మకురు రిజర్వాయర్ సైతం డెడ్‌స్టోరేజీలో ఉంది. దీంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చే పరిస్థితులు లేవు. ఫలితంగా ఈ రిజర్వాయర్ ఆయకుట్టు అంతా ఎండిపోతుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా ఈ రిజర్వాయర్ నుంచి చేర్యాల, కొమురవెల్లి మండలంలోని 38 వేల ఎకరాలకు, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని 24 వేల ఎకరాలకు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో 6వేల ఎకరాలకు సాగునీరందించారు. కొండపాక మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరందించడంతో దాదాపుగా 50వేల ఎకరాలకు పైగా ఆనాడు కేసీఆర్ సాగునీరు అందించారు. ఈ నాలుగు మండలాల్లోని అన్నీ చెరువులను నింపడంతో మండుటెండల్లో సైతం మత్తళ్లు దుంకాయి. ఇవ్వాళ కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సాగు నీటి రంగాన్ని పట్టించుకోక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పెండింగ్ పనులను పూర్తి చేయలేకపోయింది. సాగు నీటి నిర్వహణను గాలికి వదిలేసింది. ఫలితంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు బావులను లోతు చేస్తున్నారు. నూతన బోరుబావులను తవ్విస్తున్నారు. ఏం చేయలేని రైతులు ఎండిన పంటలను పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు.

నీళ్లులేక ఎండిపోయిన తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి వెళ్లే కాలువ

కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ట్యాంకర్‌తో పొలానికి నీళ్లు అందిస్తున్న రైతులు

సాగునీటి పనులన్నీ పెండింగ్‌లోనే ...

మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేయాలని నాడు కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. కరువు ప్రాంతంగా పిలువబడే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు గోదావరి జలాలు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. లింకు కాల్వల నిర్మాణానికి రూ.388.20 కోట్లు మంజూరు చేసింది. లింకు కాల్వల నిర్మాణం చేపట్టి మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలని సంకల్పించారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల (చొక్కారావు ఎత్తిపోతల పథకం) ఫేస్-2,3 ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపుతున్నారు. నాడు కేసీఆర్ ఈ ప్రాంతానికి ఇచ్చిన మాట ప్రకారం భారీగా నిధులు కేటాయించి పనులు చేయించారు. దాదాపు 40శాతం మేర పనులు కూడా పూర్తయ్యాయి. ఇంతలోనే ఎన్నికలు రావడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులకు బ్రేకులు పడ్డాయి. ఫలితంగా సాగు నీటి కాల్వల పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. పనులు పూర్తి చేసి ఉంటే నాడు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుండే. దాదాపుగా ఈ ప్రాంతంలో 1,29,630 ఎకరాలకు సాగునీరు అందుతుండే.. కాంగ్రెస్ సర్కార్ చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతోపాటు భూసేకరణ చేయకపోవడంతో అన్ని సాగునీటి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు భగ్గుమంటున్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని రైతులు కోరుకుంటున్నారు.

> కేసీఆర్ హయాంలో ఎటుచూసినా గోదావరి జల సవ్వడులు కనిపించగా.. కాంగ్రెస్ హయాంలో ఎటు చూసినా ఎండిన చెరువులు, అడుగంటిన బోరుబావులు, డెడ్ స్టోరేజీలో రిజర్వాయర్లు, ఎండుతున్న పంటలు దర్శనమిస్తున్నాయి. ఏ ఊరికెళ్లినా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. రైతులు ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో దిగాలుగా ఉన్నారు. నాడు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంతోషంగా సాగు చేసుకున్న రైతులు, ఇవ్వాళ సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి పడరానిపాట్లు పడుతూ తనలోతాను కుమిలిపోతున్నారు. సాగు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకోవడానికి రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. అయినా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. వేల ఎకరాలకు సాగునీరు అందించే తపాస్‌పల్లి రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉంది..లద్దునూరు రిజర్వాయర్‌లో చుక్కనీరు లేదు. పంట కాల్వల్లో పిచ్చిచెట్లు మొలిచాయి. దీంతో సాగునీరు రావడం కష్టంగానే ఉంది.

కొమురవెల్లి మండలం పోచంపల్లిలో బావిలో పూడిక తీస్తున్న కూలీలు

కొమురవెల్లి మండలంలో నీళ్లు లేక పొలాలు ఎండిపోతుండడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను చూసేందుకు వచ్చిన రైతులు

రైతులకు ద్రోహం చేస్తున్న సర్కారు

ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని ఎత్తిపోసేందుకు బహుబలి మోటర్లు, కాలువలు ఉన్నా సర్కారు రైతులకు సాగునీరు ఇవ్వడంలో పూర్తి విఫలమైంది. పంటలు కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు కుంటిసాకులు వెతుకుతున్నది. దేవాదుల నిర్వాహక సంస్థకు సకాలంలో వేతనాలు, మెయింటెనెన్స్ చార్జీలు ఇవ్వకపోవడంతో అధికారులు, సిబ్బంది సమ్మెకు దిగారు. దీంతో ఉన్న జలాలు కాస్తా వెళ్లిపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు రాకపోవడానికి అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యమే, వస్తున్న నీటిని సైతం రిజర్వాయర్లకు రాకుండా కొందరు ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేయాలని పలుమార్లు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడితే నామమాత్రంగా నీటిని వదిలి తిరిగి పంపులు బంద్ పెట్టారు. ప్రభుత్వ పట్టింపు లేని తనం, అధికారుల నిర్లక్ష్యంతో చేర్యాల ప్రాంతంలోని 68 ఎకరాల ఆయకట్టు ఎండిపోతున్నది. బోరుబావుల్లో నీటి చుక్క రావడం లేదు. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాల్సిందే. రైతులతో ఉద్యమాలు చేయించాల్సిన సమయం అసన్నమైంది.

– రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి గ్రామ శివారులో మల్లన్న సాగర్ ఉప కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రైతులకు శాపంగా కాంగ్రెస్ పాలన

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 10: కాంగ్రెస్ పాలన రైతులకు పెనుశాపంగా మారిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీడు భూములను సస్యశ్యామలంగా మార్చిన ఘనత కేసీఆర్ సర్కారుకు దక్కితే, కాంగ్రెస్ పాలనలో సాగునీళ్ల కోసం అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం దుబ్బాక మండలంలోని కమ్మర్‌పల్లి, అచ్చుమాయిపల్లి శివారులో నిర్మాణ దశలో ఉన్న మల్లన్నసాగర్ 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ ఉప కాల్వల పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ అంటేనే ప్రజలను కష్టాలు పెట్టే ప్రభుత్వమని విమర్శించారు. రైతులకు సాగునీటి కష్టాలు తొలిగించేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు సరఫరా చేయకుండా రైతులను కన్నీళ్లు పెట్టిస్తుందని దుయ్యబట్టారు. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నా రైతులు సాగునీటి సమస్య ఎదుర్కోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలకు సాగునీరు అందడంలేదన్నారు. 4 ఎల్ డిస్ట్రిబ్యూటర్‌తో పాటు మరికొన్ని ఉప కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సుమారు 30 గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి స్పందించి సంబంధిత అధికారులతో, కలెక్టర్‌తో మాట్లాడి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అచ్చుమాయిపల్లిలో 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ నిర్మాణ పనులు నత్తనడకనసాగడంతో గ్రామానికి చెందిన రైతులు కొంత డబ్బులు పొగేసుకుని కాల్వ పనులు చేపట్టారు. కాల్వల్లో బండరాళ్లను తొలిగించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో రైతులు సొంత డబ్బులతో బండరాళ్లను పగులకొట్టించారు. రైతులే జేసీబీలతో తవ్వకాలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం పని చేస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంపాదన దోచుకుంటుందని మండిపడ్డారు.

ఎమ్మెల్యే ఎదుట గోడు వెల్లబోసుకున్న రైతులు

కాల్వల పక్కనే ఎండిన పొలాలను చూసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎండిన వరి పంటను ఎమ్మెల్యేకు చూపిస్తూ గోడువెల్లబోసుకున్నారు. అచ్చుమాయిపల్లికి చెందిన రైతు సోమారపు నారాయణ రెండెకరాల భూమిలో మూడు నెలల్లో 6 బోర్లు తవ్వించిన చుక్కనీరు పడలేదంటూ ఎమ్మెల్యే ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నాడు. పంట పెట్టుబడితోపాటు బోర్లు తవ్వించినందుకు రూ.2.5 లక్షలు నష్టపోయానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. వేసిన పంట మొత్తం ఎండిపోయిందని, ఎమ్మెల్యేకు చూపించి గోడు వెల్లబోసుకున్నాడు. నారాయణతో పాటు గ్రామంలో చాలామంది రైతుల పంటలు ఎండిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, కిషన్‌రెడ్డి. భూంరెడ్డి, బండి రాజు, సంజీవ్‌రెడ్డి, ఎల్లం, స్వామి, రాంరెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

- ముందుచూపు లేని రేవంత్ సర్కారు
- ఎండిన చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు
- చేర్యాలలో ఎండుతున్న పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ బృందం
- నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్

చేర్యాల, మార్చి 10: కాంగ్రెస్ సర్కారు తీసుకువచ్చిన కరువుతో చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ బృందం చేర్యాలలో ఎండిపోయిన పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రైతు నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి వాటిని నేరవేర్చలేక ముఖం చాటేసిందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలనే ముందుచూపు రేవంత్ సర్కారుకు లేకపోవడంతో రాష్ట్రంలో సాగునీరు లేక చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు అడుగంటిపోయి రైతులు అన్నమో రామచంద్రా అంటున్నారని తెలిపారు. పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్పందించి మన ప్రాంతంలో ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు తీసుకువచ్చి పంటలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతి గౌడ్, నాయకులు మంచాల కొండయ్య, బీరెడ్డి ఇన్నారెడ్డి, పాక పర్శరాములు, చింతల పర్శరాములు, పచ్చిమడ్ల మానస, యాట భిక్షపతి, అవుశర్ల కిశోర్ తదితరులున్నారు.

చేర్యాలలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరులో అరుదైన జైన శిల్పం

నంగునూరు, మార్చి 10: నంగునూరులో స్థాపనాచార్య శిల్పాన్ని గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ సోమవారం తెలిపారు. జైన సాధువు, పుస్తకం, వ్యాసపీఠం, శిష్యులున్నట్లు చెక్కిన శిల్పాన్ని స్థాపనాచార్య జైన శిల్పం అంటారని తెలిపారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న శిలా స్తంభాన్ని పరిశీలించి, అది జైన శిల్పమని ప్రాథమికంగా గుర్తించామన్నారు. శిల్పంలో జైనగురువు, అతడికి రెండు వైపుల సేవకులు, కింద వ్యాసపీఠానికి రెండువైపులా బోధన వింటున్న శిష్యులు కనిపిస్తున్నారని తెలిపారు. దీనిని పరిశీలించిన చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఇది 11, 12వ శతాబ్దాలకు చెందిన జైన శిల్పాల్లో అరుదైన స్థాపనాచార్య శిల్పం అని తెలిపారన్నారు. గతంలో లభించిన ఆధారాలతో నంగునూరు పెద్ద జైన కేంద్రంగా ఉండేదని, ప్రస్తుతం లభించిన శిల్పం ఆధారంగా జైన విద్యాకేంద్రంగా వెలుగొందినట్లు తెలుస్తుందన్నారు.

శిల్పంతో కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు శ్రీనివాస్

తలాపున రిజర్వాయర్ ఉన్నా... ఎండుతున్న పంటలు

లద్దూర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- డెడ్ స్టోరేజీకి రిజర్వాయర్
- 15 రోజులుగా తగ్గిన భూగర్భ జలాలు
- పొట్టదశలో ఎండిపోతున్న పంటలు
- నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని రైతులు డిమాండ్

నీళ్లు లేక వెలవెలబోతున్న లద్దూర్ రిజర్వాయర్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 10: తలాపున రిజర్వాయర్ ఉన్నప్పటికీ నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఎండిన పంటలు పశువుల పాలవుతుండడంతో రైతులు విలపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్దూర్ రిజర్వాయర్‌లోకి ఈ ఏడాది నీళ్లు విడుదల చేయకపోవడంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గిపోయింది. తత్ఫలితంగా రిజర్వాయర్ కింద బోరుబావుల్లో నీరు లేకపోవడంతో వరి పంట పొట్టదశలో ఎండిపోతుంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించకపోవడంతో ఎండిన పంటలను పశువుల మేత కోసం వదులుతున్నారు. లద్దూర్ గ్రామానికి చెందిన రైతు ఖాజా హిదాయితుల్లా ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. 2 బోర్లతో పాటు బావి ద్వారా నీటిని అందించేవాడు. పదిహేను రోజులుగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరుబావుల్లో నీళ్లు లేక సుమారు మూడు ఎకరాల వరి పంట ఎండిపోయింది. పంట ఎండిపోవడంతో చేసేదేమి లేక పొలాన్ని పశువుల మేత కోసం వదిలివేశాడు. మూడు ఎకరాల వరి పంట ఎండిపోవడంతో రైతుకు రూ.లక్షపైనే నష్టం వాటిల్లింది. ప్రభుత్వం లద్దూర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసి, పంటలు కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


ఎండిన పొలంలో మేస్తున్న పశువులు

కేసీఆర్ ఉన్నప్పుడు కరువు అనేది తెల్వలే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు కరువు అనేది తెల్వలే. కరెంట్ కష్టాలు అసలే తెల్వలే. టైమ్‌కు చెరువులు, కుంటలు నింపేది. రైతుబంధు గిట్ల ఇచ్చి రైతులను ఆదుకునేది. ఇప్పుడు రైతులకు గడ్డు రోజులొచ్చినయి. ఆరు ఎకరాల్లో వరి పంట వేస్తే మూడెకరాల్లో పంట మొత్తం ఎండిపోయింది. తలాపునే రిజర్వాయర్ ఉన్నా దాంట్ల నీళ్లు లేవు. చుట్టుముట్టు ఉన్న గాగిళ్లాపూర్, కూటిగల్ చెరువులు కూడా ఎండిపోయినయి. మా కుటుంబమే బతుకుడు కష్టమని నిన్న మొన్ననే నాలుగు పశువులను అంగట్ల అమ్ముకొచ్చిన. నేను ఎవుసం చేసినప్పటి నుంచి పంటలు ఎండిపోవడం అనేది చూడలే. మాకు నీళ్లు ఎక్కువైతే పక్కపొంటి రైతులకు కూడా ఇచ్చేటోళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. రెండు బోర్లు ఎండిపోయినవి. పెద్ద బాయిలో చుక్క నీరు లేకుండా పోయింది. ఇదే పరిస్థితి ఉంటే బతుకుదెరువు కోసం పట్నం బాట పట్టాల్సిందే.

– ఖాజా హిదాయితుల్లా సిద్దిఖీ, రైతు, లద్దూర్

'చస్తే చావు.. బతికితే బతుకు'..

- రైతు దరఖాస్తును పక్కన పడేసిన డీఆర్వో
- కలెక్టరేట్ భవనం ఎక్కిన రైతు
- కొన్నేండ్లుగా భూ సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన
- సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ఏండ్లుగా తిరుగుతున్నా..భూసమస్య పరిష్కరించడం లేదని ఓ వ్యక్తి మెదక్ కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి సోమవారం హల్‌చల్ చేశాడు. హవేళీఘనపూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన పట్నం సురేందర్ కొన్నేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని కలెక్టర్ కార్యాలయం పైకి ఎక్కాడు. పైనుంచి దూకుతానని అరగంట పాటు హల్ చల్ చేశాడు. అక్కడ ఉన్న సిబ్బంది, విలేకరులు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కస్తామని నచ్చజెప్పడంతో సురేందర్ కిందకు దిగాడు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ.. శమ్నాపూర్‌లో తన తండ్రి రమేశ్ పేరు మీద 18 గుంటల భూమి ఉండగా, అందులో 3 గుంటలు తల్లి పేరున మార్చారు. 15 గుంటల భూమి తన తండ్రి పేరు మీద పట్టా ఉండగా ధరణిలో ఆధార్ కార్డు తనది ఎంట్రీ కావడంతో రైతుబంధు, పీఎం కిసాన్ అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చినా లాభం లేదన్నాడు. ఇటీవల హవేళీఘనపూర్ తహసీల్దార్ వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించాలని అడగ్గా, ఆ విషయం తమకు సంబంధం లేదని సమాధానమిచ్చారని తెలిపారు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చానని తెలిపాడు. అయితే అధికారులు దరఖాస్తును టేబుల్ మీదే వదిలేసి వెళ్లారని చెప్పాడు. ఆ దరఖాస్తు తీసుకొని డీఆర్వో వద్దకు వెళితే ఆయన దరఖాస్తు పక్కకు విసిరేసి, చస్తే చావు బతికితే బతుకు అన్నారని సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను చస్తే అయినా భూ సమస్య పరిష్కారం అవుతుందేమోనని కలెక్టరేట్ భవనం ఎక్కినట్లు తెలిపాడు. అదనపు కలెక్టర్ నగేశ్ బాధితుడిని పిలిపించుకుని మాట్లాడాడు. హవేళీఘనపూర్ తహసీల్దార్‌ను, ధరణి ఆపరేటర్‌ను పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

మెదక్ కలెక్టరేట్ భవనం పైకి ఎక్కిన సురేందర్